**ఒకరి జీవితాన్ని ఒకరు శాసింపకూడదు ఎవరి జీవితాన్ని వారే మలుచుకోవాలి అదే సార్థకత**

పెద్దకథ

# లాస్ట్ ట్రిప్

## కె. సదాశివరావు

**న్యూయార్క్ జె.ఎఫ్.కె. ఎయిర్‌పోర్ట్ మరో పది నిముషాల్లో చేరబోతోంది తన ప్రైవేట్ జెట్.రాంచంద్ అలిసిపోయివున్నాడు. జెట్‌లాగ్‌తో వయసు మీద పడుతున్నా నిర్లక్ష్యంగా బతికేడు ఇన్నాళ్ళూ. డెబ్భైరెండేళ్ళ వయసులో ఈ జెట్ సెట్టింగ్ ఆరోగ్యానికి ఏమంత మంచిదికాదని డాక్టర్ శేఖర్ ఎన్నోసార్లు హెచ్చరించాడు.**

డాక్టర్ల మాటలు వింటే ఈ లోకంలో ఎవరూ ఏమీ చేయలేరని రాంచంద్‌కో దృఢనమ్మకం. అలా సలహాలివ్వడం వాళ్ళ డ్యూటీ. ఎన్నిసార్లు హెచ్చరించినా రాంచంద్ తన లైఫ్ స్టైల్‌లో ఏ మాత్రం మార్పు లేకుండా జాగ్రత్తపడ్డాడు. ఇప్పుడు తప్పలేదు సలహా పాటించక...కాని ఇందులోని తమాషా ఏమిటంటే డాక్టర్ చెప్పింది మరో జెట్‌ట్రిప్‌కి దారితీయడం!

''రామ్! నాసలహా నీవు ఎన్నడూ తీసుకోలేదు. ఇన్నాళ్ళూ పసిపిల్లవాడిలా దగ్గిరుండి నీతో మందులు మింగించి ఏదో నా డ్యూటీ చేస్తున్నాను. నీ లైఫ్ పేస్ తగ్గించుకోమని చెప్పి చెప్పి నాకు విసుగువస్తున్నది. ప్లీజ్ ఈ ఒక్కసారి నామాట విను. గోటూ న్యూయార్క్! హేవ్ ఎ హాలీడే! హేవ్ ఎ కంప్లీట్ చెకప్! కొన్నాళ్ళు నీ వ్యాపారపు గొడవలు మరచిపో.''

''ఒకే ఒకే'' అన్నాడు విసుగ్గా రాంచంద్.

రాంచంద్...ప్రొప్రైటర్ ఆఫ్ రాంచంద్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్... రాంచంద్ పాలెస్ హోటల్ చెయిన్ ఓనర్...స్టీల్ మిల్స్... సిమెంట్ ఫ్యాక్టరీలు...టెక్స్ టైల్స్... ఎలక్ట్రానిక్స్...సూపర్ మార్కెట్స్...ఇంపోర్ట్, ఎక్స్పోర్ట్ షిపింగ్...మల్టీ బిలియనీయర్ రాంచంద్. ఈ దేశంలోని భాగ్యవంతులలో మూడో, నాలుగో స్థానంలో వుంటాడు. అతడి కంపెనీ ఫార్చ్యూన్ మాగజైన్ లిస్టు ప్రకారం ఇంటర్నేషనల్ ఫైవ్ హండ్రెడ్ ఇండస్ట్రీస్‌లో ఒకటి. ప్రపంచంలోని ఇతర బిలియనీయర్స్ అతడి మిత్రులు ఎడ్సెల్ ఫోర్డ్, గియొవానీ, ఆగ్నేల్లీ (ఫియట్) కాన్రాడ్ హిల్టన్, లీ అయకాక్కా, హోండా అతడితో గోల్ఫ్ ఆడు తూ బిజినెస్ డీల్స్ ఆలోచిస్తారు. అయిల్ షేక్స్‌కి అతడు గుడ్ ఫ్రెండ్. బాంకర్స్‌కి అతడి మాటమీద గురి...బిగ్ బిజినెస్ ప్రపంచానికి అతడో మూలస్తంభంలాంటి వాడు. స్వయంకృషితో ఇంత సంపదని ఒక తరంలో సంపాదించి అంతర్జాతీయ ఖ్యాతిని పొందిన ఏకైక భార తీయుడు.

బిజినెస్ తప్ప మరో ప్రపంచంతో అతడికి ప్రమేయం లేదు. అతడి మనసునిండా సుడులు తిరిగే ఐడియాలు ఏదో ఒక రోజున నిజస్వరూపాన్ని పొంది నిజమైన ప్రాజెక్టులుగా మారి కొన్ని వేలమందికి జీవనోపాధిని కలిగిస్తాయి. అందరూ అసాధ్యం అన్న పనులు నిజం చేయడం రాంచంద్‌కి సరదా. డబ్బు సంపాదించడం అతడికి గాలి పీల్చినంత సులభం. ప్రతి సెకనుకూ అతడి ఎకౌంట్‌లో ప్రపంచంలో ఎక్కడో అక్కడ కొన్ని లక్షలు-అన్ని రకాల కరెన్సీలలో జమ అవుతూనే వుం టాయి. ఇవన్నీ చూడటానికి ఆర్మీలాంటి ఎకౌం టెంట్స్ వున్నారు.

డెబ్బై రెండేళ్ళ రాంచంద్‌లో జవసత్వాలు ఉట్టిపడుతుంటాయి. అతడి పవర్‌ఫుల్ ఫ్రేమ్‌తో, గంభీరమైన కంఠంతో ఎవరినో శాసించడానికి, తనకి కావలసిన పనులు ఆర్డర్ వేసి చేయించుకోవటానికి పుట్టినవాడిలా ప్రదర్శిస్తాడు. అతడి కాలపు విలవ అతడికి తెలుసు. ప్రతిక్షణం వాల్యువబుల్. అందుకే కాస్త అసహనం అతడి ప్రవర్తనలో తొంగి చూస్తూవుంటుంది. వారం రోజులు న్యూయార్క్‌లో వుండటం ఓయెత్తు...చెకప్ చేయిం చుకోవడం వేరు. డామ్ ది డాక్టర్! అనుకున్నాడు రాంచంద్.

ఎదురుగా మన్‌హటన్ ఐలెండ్ కనిపిస్తోంది. లక్షలాది లైట్ల వెలుతురుతో, కదులుతున్న లక్షలాది కార్ల సూపర్ హైవేల మీద పారుతున్న లైట్లు వరదలా వున్నాయి. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వెలుగుతూ స్వాగతం చెబుతోంది. స్కైస్క్రేపర్స్ వెలుగుతున్న లైట్లతో దీపస్తంభాల్లా వున్నాయి. న్యూయార్క్ చూసినపుడల్లా రాంచంద్‌కి కలిగే భావాలు మానవుడి అభ్యున్నతికి ఆ నగరం ఒక చిహ్నం. సాహసానికి ప్రతిబింబం. మానవుడి ధైర్య సాహసాలకి... చాతుర్యానికి...శక్తియుక్తులకు... శ్రమకి...అది దర్పణం...మానవుడు సంకల్పబలంతో, ధనంతో, ఊహతో ఏమి చేయగలడో నిరూపించడానికి న్యూయార్క్ నగరం ఓ తార్కాణం. న్యూయార్క్! సిటీ ఆఫ్ లైట్స్! నిద్రపోని మహానగరం! ఫన్ సిటీ! సిన్ సిటీ! బిగ్ యాపుల్!!న్యూయార్క్!! న్యూయార్క్!!

జెయఫ్కె ఎయిర్‌పోర్ట్‌లో సున్నితంగా లాండ్ చేశాడు కెప్టెన్ రాజ్ హోస్టెస్ మీనా ఎంతో అప్యాయంగా అన్ని సౌకర్యాలు చూపి సేవచేసింది. మరచి పోకుండా వాళ్ళకి ఏవైనా గిఫ్ట్స్ పంపించాలని మేనేజర్‌కి చెప్పాలి అనుకున్నాడు రాంచంద్.

ఎయిర్‌పోర్ట్ విజిటర్స్ లాంజ్‌లో తనకోసం మేనేజర్ కపూర్, హౌస్‌కీపర్ జేసన్ ఎదురుచూస్తున్నారు. ఇమిగ్రేషన్, కస్టమ్స్ అన్నీ త్వరగా పూర్తిచేశాడు కపూర్

''సర్ మీరు ఇంటికి వెళ్ళవచ్చు. జేసన్ మిమ్మల్ని తీసుకెడతాడు. నేను బాగేజ్ తీసుకుని వెనుకవస్తాను'' అన్నాడు కపూర్. జేసన్ నవ్వాడు సంతోషంగా. నల్లటి ముఖంలో తెల్లని పళ్ళు మెరిశాయి. జేసన్ నీగ్రో. అతడు, అతడి భార్య మార్తా తన న్యూయార్క్ బ్రౌన్‌స్టోన్ ఇంటిని జాగ్రత్తగా మెయిన్‌టెయిన్ చేస్తున్నారు ఇన్నేళ్ళ నుండీ...తనకి ఇష్టమైన డిషెస్ వండి పెట్టడం వాళ్ళకి ఎంతో సరదా...

''మార్తా ఎలా వుంది జేసన్'' అడిగాడు రాంచంద్ కరచాలనం చేస్తూ.


''ఫైన్ మాస్టా'' అన్నాడు జేసన్.

కారుకోసం వెళ్ళాడు జేసన్. రాంచంద్ మెల్లగా నడుస్తున్నాడు ఎక్సిట్ వేపు.

''డాడీ!''

ఉలిక్కిపడ్డాడు రాంచంద్. ఆ కంఠంలోని మార్దవం ఎన్నడో తనకి ప్రతిరోజూ ఆనందాన్నిచ్చేది, ఎన్నేళ్ళనాడో ! తిరిగి చూశాడు.

ఎదురుగా శ్రీధర్. ప్రక్కనే ఓ అందమైన బ్లాండ్ పిల్ల. నీలం రంగుకళ్ళతో నవ్వుతూ తనవంకే చూస్తోంది.



క్రింద నిలబడివున్నారు ఇద్దరు పిల్లలు. ఓ ఆడపిల్ల లివింగ్ డాల్‌లా వుంది. నల్లటి జుట్టు...కడిగిన ముత్యం లాంటి కాంప్లెక్షన్...ఓ బుజ్జిబాబు వాడి తల్లి గౌను కిందనుండి దొంగలా చూస్తున్నాడు.

"డాడీ నీ కోడలు కాథరిన్. నీ మనవడు రామూ, నీ మనవరాలు జేన్-షార్ట్ నేమ్ ఫర్ జానకి-అమ్మ పేరు."

ఏం చెయ్యాలో ఓ క్షణం తోచలేదు. వెంటనే కాథరిన్ దగ్గరకొచ్చి కరచాలనం చేసింది. ఏం చేస్తున్నాడో తెలియకుండా పిల్లల వేపు చేతులు చాచాడు. జేన్ పరిగెత్తుకు వచ్చింది కొత్తదనం ఏమాత్రం లేకుండా ముద్దు పెట్టుకున్నాడు. జేన్ బుగ్గలు పరిమళిస్తున్నాయి-అందంతో, ఆరోగ్యంతో, ఆనందంతో. జేన్ కిలకిలా నవ్వింది. రామూ తప్పటడుగులతో కాస్త బెరుగ్గా దగ్గరకొచ్చి తనకి షేక్‌హేండ్ ఇచ్చాడు. వొంగి వాడి చిన్నిచేతిని మెల్లగా మృదువుగా స్పృశించాడు.

జేన్ అంది.

"మీరు మా తాతయ్య కదూ?"

"అవును తల్లీ"

ఎప్పుడూ రాలేదేం మా ఇంటికి?"

"పనివుండి రాలేకపోయాను తల్లీ"

"ఇక్కడే వుండిపో తాతయ్యా. వుంటావు కదూ?" సీరియస్‌గా అడిగింది బుల్లి జానకి.

"ప్రయత్నం చేస్తాను డార్లింగ్"

"మీరు మా దగ్గరే వుండాలి మామగారు" అంది కాథరిన్.

"ఈ సారికి వదిలెయ్యి మై డియర్. చాలా ముఖ్యమైన పనిమీద వచ్చాను. మరోసారి తప్పకుండా అలాగే చేస్తాను"

బాగేజ్ వచ్చేసింది. జేసన్ కారు తీసుకువచ్చాడు. డోర్ తీసి వెయిట్ చేస్తున్నాడు. కపూర్ కొత్తమనుషుల్ని వింతగా చూస్తున్నాడు. ఎయిర్‌పోర్ట్ శబ్దాలలో వాళ్ళకి సంభాషణ వినిపించే అవకాశం లేదు.

"వస్తాను శ్రీధర్"

"మిమ్మల్ని చూసి సంతోషిస్తావనుకున్నాను డాడీ" నవ్వేడు రాంచంద్.

అదేంమాట శ్రీధర్. మీ అందర్నీ చూస్తే నాకు ఎంతో ఆనందంగా వుంది"

"అయితే నన్ను క్షమించారా డాడీ?"

మెల్లగా నడుస్తున్నారు-ముందు రాంచంద్, శ్రీధర్. వెనక పిల్లలు వేసే ప్రశ్నలకి సమాధానాలు చెబుతూ వాళ్ళని నడిపిస్తోంది కాథరిన్.

"క్షమించడానికేముంది? నీ జీవితాన్ని నీకు కావలసిన విధంగా మలుచుకున్నావు. నీవు ఆనందంగా వున్నావని అనుకుంటున్నాను" నిజాయితీతో గుండెల్లోంచి వచ్చి నప్పటికీ ఆ మాటల్లో బిట్టర్‌నెస్ కొద్దిగా తొంగి చూసింది.

"డాడీ! నేను చాలా అదృష్టవంతుణ్ని కొన్ని విధాలా. కాథరిన్ ఈజ్ ఎ వండర్‌ఫుల్ వైఫ్. నా జీవితానికి అర్థాన్నిచ్చింది ఆమె. కాథరిన్ సాహచర్యం వల్ల నా జన్మకి ఓ నూతన స్ఫూర్తివచ్చింది డాడీ!" నా కెరియర్ బాగానే సాగుతున్నది డాడీ, ప్రస్తుతం నాకు కావలసింది మీ ఆశీర్వాదం మీ మెప్పు అంతే."

రాంచంద్ ముఖం మీద చిరునవ్వు లీలామాత్రంగా గోచరించింది. తన కొడుకు దేశంగాని దేశంలో...వేరే నగరంలో ఓ స్ట్రేంజర్‌లాగా తన కథ ఏకరువు పెడుతున్నాడు. తనకి ఏమాత్రం తెలీని పిల్లతో జీవితం కొనసాగిస్తూ...తన జీవితాన్ని ఓమార్గంలో నడిపించుకుంటూ...తండ్రి ప్రమేయం ఏమాత్రం లేకుండా. ఇన్నేళ్ళ తర్వాత ఎంత చిత్రం ఈ జీవితాలు? కారెక్కి కూర్చున్నాడు రాంచంద్.

"గుడ్ బై శ్రీధర్"

"బై డాడీ! మా ఇంటికి రావడానికి ప్రయత్నించండి డాడీ" ఓ కార్డ్ ఇచ్చాడు శ్రీధర్.

"ప్రయత్నిస్తాను"

కాథరిన్ పిల్లలు, శ్రీధర్ అందరూ ఓ లైనులో నిలబడి చేతులతో వీడ్కోలు చెప్పారు. వాళ్ళ కళ్ళల్లోని ఆనందపు మెరుపులు ఎయిర్‌పోర్ట్‌లోని పవర్‌ఫుల్ హాలోజన్ లాంప్స్‌కన్నా కాంతివంతంగా మెరిశాయి. హైవే ట్రాఫిక్‌లోనికి కారు ప్రవేశించగానే చేతిలోని కార్డ్‌ని వదిలేశాడు రాంచంద్. అది గాలిలో ఎగిరిపోయింది. బయట చలిచలిగా వుంది. అద్దంపైకి లేపాడు. రాంచంద్ గుండెలో బాధతో కూడిన అనిర్వచనీయమైన చలి!

జరిగిపోయిన ఎన్నో ఏళ్ళనాటి జ్ఞాపకాలు వరదలా అతడి మనసుని ముంచెత్తబోయాయి.

కాని రాంచంద్ మైండ్‌కి ఓ ప్రత్యేకమైన శక్తివుంది. తనకి ఇష్టంలేని టాపిక్ నుండి మనసుని బలవంతంగా మరలించి వేరే



విషయాల మీదికి ఆలోచనలని సారించి, తనకి అవసరం లేదనుకున్నా, ఏవిధంగానైనా మానసికంగా బాధాకరంగా పరిణమిస్తే తప్పించుకోగల మానసిక సామర్థ్యం వుంది. అతడి మైండ్‌కి ఎంతో డిసిప్లిన్ వుంది. అతడి మానసిక పరిణతికి, జ్ఞాపకశక్తికి అతడి మిత్రులకు ఆశ్చర్యం... అతని శత్రువులకి గౌరవంతో కూడిన భయం...అతడి ఆలోచనల సరళిని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరుకునే వారికి తికమక తప్పని సరి. అతడి మైండ్ ఓ పెద్ద పజిల్! ఏ మాత్రం అర్థంకాని బ్రిలియంట్...డాజ్‌లింగ్...కఠినమైన మనోప్రపంచం అతడిది. ఆలోచనలమీద

తెరదించేశాడు. అతడు ప్లాన్‌చేస్తున్న మరో ప్రాజెక్టు గురించిన డాటా మనస్సులోని జ్ఞాపకాల తెరలని ఆక్రమించింది. రాంచంద్ ఆలోచనలు మరో దారిన పడి వేరు మార్గాల్లో ప్రయాణం చేశాయి.

మరునాటి ఉదయం కపూర్ బ్రేక్‌ఫాస్ట్ తర్వాత చెప్పాడు.

"సర్! డాక్టర్ కోల్మన్‌తో మీ ఎపాయింట్‌మెంట్ పదిన్నరకి."

"ఓకే కపూర్" అన్నాడు నిర్లిప్తంగా.

ఏం జరుగుతుందో తనకి తెలుసు. ఆ డాక్టరెవడో తనకి అనవసరమైన పరిచర్యలు చేస్తాడు- మళ్ళీ యూరిన్ టెస్ట్...బ్లడ్ టెస్ట్...ఎక్స్‌రేలు...ఆల్ బ్లడీ

## ప్రశ్నార్థకం

ఎచ్చోట దివ్య సంస్కృతి వాణి వ్యర్థమౌ
మృతభాషగా నీసడింపబడెడు
ఎచ్చోట విద్యలకెల్ల విదేశ భా
షయె వాహికగ కొనసాగుచుండు
ఎచ్చోట లబ్ధి నార్జింపగా నన్య ధ
ర్మము గైకొని ప్రజాళి మసలుచుండు
ఎచ్చోట జనులు భీతిల్లుచు నల్ప సం
ఖ్యాకుల పాదాల నాశ్రయింతు
రెచట మంచినీరును విక్రయింపబడెడు
ఎచట మధువు ధారళమై తృష్ణ తీర్చు
ఎచట వంచనా శిల్పులూరేగుచుండు
రట్టి దేశ మెట్లభినంద నార్హమగును?

—కోటగిరి విశ్వనాథరావు

టెస్ట్స్...మళ్ళీ మళ్ళీ జరుగుతాయి. అన్ని టెస్టులూ జరిగాక వాళ్ళు తనకి చెప్పేది ఒకటే.

"మీరు ఎంతో ఆరోగ్యంగా వున్నారు. యూవార్ లైక్ ఎ బుల్. ఈ వయసులో ఇంత ఆరోగ్యంగా ఉండడం చాలా అమేజింగ్!"

ఇవే మాటల్ని రాంచంద్ ప్రతి మూడేళ్ళకీ ప్రపంచంలోని ఎన్నో నగరాల్లో డాక్టర్ల నోటినుండి విన్నాడు.

నవ్వుకునేవాడు తన సీక్రెట్ ఆఫ్ హెల్త్ ఏమిటో తనకే తెలుసు. మోడరేట్ తిండి...మోడరేట్ తాగుడు...షాంపేన్ ఓ రెండు గ్లాసులు...లేకపోతే మధ్యాహ్నం వేళ ఓ రెండు చిన్న గ్లాసుల మార్టినీలు... సుష్టుగా భోజనం రెస్ట్...వర్క్...వర్క్ అంతులేని నిర్ణయాలని క్లియర్ మైండ్‌తో తీసుకోవడం-లాభనష్టాలను ఒకే విధంగా అనెమోషనల్ చూసి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం, సామర్థ్యం, డిసిప్లిన్ ఉన్న వ్యక్తులను పసిగట్టి వారికి పదవులు ఇవ్వడం వల్ల తన బాధ్యత సగం తీరిపోయేది. ఇంకా రిలాక్సేషన్... స్విమ్...ప్లే గోల్ఫ్ స్క్వాష్ ఎ ఫ్యూ స్టార్ లెట్స్- **From Hollywood to Bom- bay** నథింగ్ రాంగ్. డాక్టర్ చెప్పాడు సెక్సువల్లీ నీవింకా విగరస్‌గా వున్నావు. విడోయర్ గాబట్టి ఏ బాదర బందీ లేదు. తనతో ఎఫైర్స్ నడిపించిన వాళ్ళలోని డైవోర్సీలూ, మధ్యవయసులో వున్న రిచ్ వుమెన్, ఎలాగైనా పెళ్ళాడి మిసెస్ రాంచంద్ అనిపించుకుందామని తాపత్రయపడి ఎమోషనల్‌గా దెబ్బతిన్న చిన్నవయసు వాళ్ళా...తనకి తెలుసు డెబ్బై ఏళ్ళు దాటాక పెళ్ళి



అబ్సర్డ్ అని. తన ఫ్రెండ్స్ కొందరు ఎన్నేళ్ళొచ్చినా పెళ్ళిళ్లు చేసుకుంటూనే వున్నారు. తర్వాత వచ్చే సమస్యల్ని పరిష్కరించుకోలేక నానా బాధలూపడు తున్నారు. ఒనాసిస్-జాక్విలిన్‌ని చేసుకున్నాక కూతురితో పోట్లాట... టెక్సాస్ మిలియనైర్స్ వీటిల్లో ఎంతో జాగ్రత్తగా వుంటారు. స్క్రూ దెమ్ బట్ డోంట్ మారీ! అన్నది వాళ్ళ ఫిలాసఫీ.

టెస్టులు పూర్తయ్యాయి.

ఈ ఏభై ఏళ్ళకాలంలో ఎన్నోసార్లు జరిగాయి.

ఈసారి ఆశ్చర్యకరంగా వాక్యం మారింది.

"మిస్టర్ రాంచంద్. మీకు నేను చెప్పబోయేది అశుభవార్త." అన్నాడు డాక్టర్ కోల్మన్.

"ఏమిటది. మేక్ ఇట్ స్నాపీ" ఇంపేషంట్‌గా అన్నాడు రాంచంద్.

"మీకు కాన్సర్! కాని ఎర్లీ స్టేజిలో వుంది. ఇంకా కొద్ది నెలలు నిర్లక్ష్యం చేసినట్లయితే చాలా ప్రమాదకరంగా వుండేది. ఇప్పుడు మీకేమీ భయంలేదు" అన్నాడు నవ్వుతూ.

"నాకేమీ భయంలేదు డాక్టర్ కోల్మన్. ఈ వయసులో నా భయానికి అర్థం వుండదు. కాని జరగవలసిందేమిటో చెప్పండి" చిరునవ్వుతో అన్నాడు రాంచంద్.

కోల్మన్ అన్నాడు.

"నాకు తెలుసు. యు ఆర్ గ్రేట్ గ్రె. అందుకే మీరంటే నాకు ఎంతో గౌరవం. నేను మిస్టర్ కపూర్‌కి ఓ టెలిఫోన్ నంబర్ అడ్రస్ ఇచ్చాను. మీరు ఇప్పుడు అక్కడికి వెళ్ళి వారిని కలవండి. వాళ్ళు స్పెషలిస్ట్స్. మంచి మనుషులు. కాని కాస్త తిక్కమనుషులు కూడా. ఫిఫ్త్ ఎవెన్యూలో ప్రాక్టీస్ చేసి వాళ్ళు మిలియన్స్ సంపాదించవచ్చు కాని ఏదో ఐడియల్ పెట్టుకుని ప్రాక్టీస్ చేస్తున్నారు. దే ఆర్ ది బెస్ట్ ఇన్ దిస్ ఫీల్డ్! వెరీ కాంపిటెంట్. ఓ కొద్ది రోజులలో మిమ్మల్ని ఆపరేట్ చేసి పూర్తి ఆరోగ్యవంతుల్ని చేస్తారు."

"థాంక్స్ డాక్టర్. థాంక్స్ ఎ లాట్."

"వెల్ గుడ్‌బై. గుడ్‌లక్"

"ఈ వయసులో నాకు లక్ అవసరం లేదనుకుంటాను డాక్టర్."

"మీ అభిప్రాయంతో నేను ఏకీభవించను. మనిషికి జీవితాంతం అదృష్టంకావాలి" అన్నాడు డాక్టర్ సహృదయంతోనవ్వుతూ.

కారు హాస్పిటల్ దాటి బయలుదేరింది. ఫాషన్‌బుల్ ఏరియాస్-బిజీ స్ట్రీట్స్ దాటింది. హార్లెమ్ స్లమ్స్‌లోనికి వెళ్ళింది. ఇక్కడ వీధుల్లో చెత్తకుండీలు చెత్తతో నిండి పొర్లిపోతున్నాయి. భయంకరమైన దుర్వాసన అన్ని వైపుల్నించీ వస్తోంది. వీధుల్లో డొక్కలు ఎండిన కుక్కలు గార్బేజ్‌లో వెతుక్కుంటున్నాయి తిండికోసం. బాగా బలిసిన ఎలుకలు, పందికొక్కులు అటూ, ఇటూ పరిగెడుతున్నాయి. అన్ని దుర్వాసనలూ ఇక్కడనుంచే పుడతాయి. న్యూయార్క్ నగరపు కురూపైన మరో ముఖం. ది అదర్ సైడ్ ఆఫ్‌ది సిటీ! ఇక్కడ దారిద్ర్యం వుంది. ఇక్కడ గుండాలకి, హుడ్లమ్స్, గాంగ్‌స్టర్స్‌కి ప్లేగ్రౌండ్...పీకలు కోసేసి పారేసిన శవాలు ఇక్కడ పుష్కలంగా దొరుకుతాయి. న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్ **(NYPD)**కి పని ఇక్కడే ఎక్కువ వుంటుంది. ఎవరికి భద్రత లేదు. ఇక్కడ 'లా' లేదు. ఇక్కడ 'ఆర్డర్' అంతకన్నా లేదు. ఇక్కడి వాతావరణం భయంతో నిండివుంటుంది. తెలియని భయం-పొంచి వున్న మృత్యువు-రక్తపువాసన-హింస-ప్రతిహింస-ప్రాణానికి విలువ చాలా తక్కువ. ఇది భూమి మీద నరకంతో పోలుస్తారు కొందరు. ఇక్కడ ఓ పేట వుంది. హెల్స్ కిచెన్...గాంగ్‌స్టర్స్ అక్కడే వుద్భవిస్తారు. న్యూయార్క్ మాఫియాకి కీలకస్థానాలు ఈ స్లమ్స్. వాళ్ళకి కావలసిన డ్రగ్‌పెడ్లర్స్ ఎసాసిన్స్, ప్రాస్టిట్యూట్స్, పింప్స్, డెస్పరేట్ కారక్టర్స్, గాంబ్లర్స్... అందరూ ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగి ఇక్కడే వయొలెంట్‌గా చచ్చిపోతుంటారు ముప్ఫై ఏళ్ళు నిండ కుండా. లగ్జరీ ఎపార్ట్‌మెంట్స్ ఆఫ్ ఫిఫ్త్ ఎవెన్యూ ఎడ్వర్టైజింగ్ ప్రపంచపు మేడిసన్ ఎవన్యూ...బ్రైట్ లైట్స్ ఆఫ్ బ్రాడ్‌వే...ది గ్రేట్ వైట్ వే! నిరంతరం లైట్లతో, శబ్దాలతో, మ్యూజిక్‌తో, నవ్వులతో మార్మోగే న్యూయార్క్ వీథులకీ ఈ ప్రపంచానికి ఎంతోదూరం లేదు. అయినా ఇలాంటి నరకం కొద్ది కిలోమీటర్ల దూరంలోనే వుండి చీకటి ప్రపంచంలా వర్ధిల్లుతుందని కొందరికే తెలుసు. తెలిసినా వాళ్ళు చేయగలిగిందేమీ లేదు.

కారు ఓ చిన్న బ్రౌన్‌స్టోన్ ఇంటిముందు ఆగింది. ఆ వీధి మురికిగా వున్నా ఆ ఇల్లు నీట్‌గా వుంది. పాటెడ్ ప్లాంట్స్ మెట్ల మీద వున్నాయి. కిటికీలు, ద్వారాలు శుభ్రంగా వున్నాయి. చిన్న పాట్‌లో రోజ్ ప్లాంట్ వుంది. దానికి పెద్ద రెడ్‌రోజ్ పూసివుంది. ఆ ఇల్లూ, ఆ ప్లాంట్స్ మాట్టావున్న మురికి సముద్రంలో ఓ చిన్న ద్వీపంగా కనిపించాయి. మిగిలిన ఏరియా సైతాను ప్రత్యేకంగా మురికినీ, రోగాల్నీ, చావుల్నీ తెప్పించడానికి సృష్టించిన నరకభాగంలా కనిపించింది.

# మనోయజ్ఞం

మనసులో నిస్తరంగ
మానస సరోవరం
కనుమూతలో
కైలాస శిఖర దర్శనం
నిశ్శబ్ద నిమజ్జనంలో
నింగి గంగాస్నానం
విశ్వలోపేత దేహాలుప్తంతో
ఆత్మ శివార్పణం
తనువు
నడమ బాటకన్న
తలపు
డుగు యాత్ర మిన్న

—చివుకుల కృష్ణమూర్తి

కారుదిగి మెట్లు ఎక్కాడు. ఇలాంటి పనిమీద తనని తరిమిన తన పెర్సనల్ డాక్టర్‌ని కాస్సేపు తిట్టుకున్నాడు. చెకప్! డామ్ చెకప్! డామ్ డాక్టర్స్! డామ్ డామ్!! అయితే తనకి వచ్చేసిందన్నమాట! బిగ్ సి! కాన్సర్! ఇప్పుడు తన పేస్ తగ్గడం ఆటోమాటిక్! డాక్టర్ శేఖర్! నీవే గెలిచావు చివరకి. ఇక నీ మాట వినకతప్పదనుకుంటున్నావు కదూ?

నో! నాట్ రాంచంద్!!

ఈ ప్రపంచంలో ఏమి జరిగినా అతడి జీవిత విధానంలో మార్పువుండదు. ఆ స్టుపిడ్ కాన్సర్ గ్రోత్‌ని ఆపరేట్ చేయించి అవతల పారేసి తన పని మాసుకుంటాడు. బాక్ టూ వర్క్ ఓల్డ్ బోయ్! అనుకున్నాడు రాంచంద్.

కపూర్ బెల్‌కొడుతుండగా డాక్టర్ల పేర్లు చూసి రాంచంద్ షాక్ తిన్నాడు. తన జీవితంలో ఇంత పెద్ద షాక్ ఎన్నడూ తినలేదు.

డాక్టర్ శ్రీధర్ రాంచంద్ **M.D**

డాక్టర్ (మిసెస్) కాథరిన్ రాంచంద్ **M.D**

లోనికి వెళ్ళాడు. పెద్ద వెయిటింగ్ హాలు వుంది. దాని నిండా రోగిస్టులు-నీగ్రోలు, పుయెర్టోరికన్స్, మెక్సికన్, పూర్ ఇటాలియన్స్-వైట్ ట్రాష్, బ్లాక్ ట్రాష్-నరకంలో ఓ దృశ్యం చూస్తున్నట్టుగా వుంది. వాళ్ళకి రకరకాల రోగాలున్నాయి. రాంచంద్ జీవితంలో అంత దారుణమైన మానవ దీనావస్థను చూడలేదు. రాంచంద్ పుట్టిపెరిగింది పేదరికానికి పుట్టినిల్లయిన ఇండియాలోనైనా అతడి ధ్యేయం ఓ పారిశ్రామిక విప్లవం సృష్టించి దారిద్ర్యాన్ని తనదేశంనుండి పారదోలాలని రాంచంద్ కల. ఓసారి 'బిజినెస్ వరల్డ్' కవర్ పేజీ మీద అతడి రంగుల ఫోటోవేసి ఓ ఫీచర్ రాశారు.

"భారతదేశంలో మరో నూరుమంది రాంచంద్‌లు వుంటే ఈ దేశం మరో జపాన్, మరో అమెరికా అయివుండేది." రాంచంద్ నవ్వేడు అది చదివి.

అతడికి తెలుసు చరిత్ర సృష్టించిన శక్తులని ఏ కొద్దిమంది వ్యక్తులూ సరిచెయ్యలేరు. చారిత్రిక శక్తులే మళ్ళీ భారతీయుల్లో నూతనశక్తి యుక్తుల్ని ప్రసాదించి చరిత్ర మార్గం తిప్పితేనే మంచి జరుగుతుంది. వాళ్ళ మానసిక మార్పులవల్లే దేశ పరిస్థితుల్లో మార్పు రావాలి. నేను, నాలాంటి వాళ్ళు ఎందరైనా ప్రయోజనం వుండదు. ఇన్ని కోట్లమంది జీవితాలకి బాధ్యత కొన్ని వేలమంది భుజాలమీద బరువులా పెట్టడం అన్యాయం అనుకున్నాడు రాంచంద్ ఆనాడు. గ్రీక్స్ భూభారాన్ని అట్లాస్ అనేవాడి భుజస్కంధాల మీద మోపారు. ఒక వ్యక్తి ఇంత భారాన్ని ఎందుకు మోయాలి . కపూర్ లోనికి వెళ్ళి శ్రీధర్‌ని తీసుకువచ్చాడు. కాథరిన్ కూడా వుంది. ఇద్దరూ కాస్త నెర్వస్‌గా కనిపించారు.

"డాక్టర్ కోల్మన్ ఫోన్‌చేసి చెప్పాడంతా. టెస్ట్ రిజల్ట్స్ కూడా పంపాడు అవి చెక్ చేస్తున్నాను."

"ఆ వార్త మమ్మల్ని ఎంతో బాధపెట్టింది" అంది కాథరిన్. భుజం మీద తట్టాడు రాంచంద్.

"ఓకేట్ ఈజీ మైడియర్" అన్నాడు.

"మీరు కూర్చోండి. ఈ పదిమంది పేషెంట్స్‌ని పంపించేసి వస్తాను. కేట్, ప్లీజ్ గెట్ హిమ్ సమ్‌థింగ్."

"నా కేమీ వద్దు కాథరిన్! నేను ఇక్కడ కూర్చుని వెయిట్ చేస్తాను. మీరు మీ పని చూసుకోండి" పేపర్ అడ్డం వుందేగాని రాంచంద్ చూపులన్నీ పేషెంట్స్ మీదే వున్నాయి. ఒక నీగ్రో కత్తిపోట్లతో కట్టుగట్టి వున్నాడు. మరొకడు కళ్ళుతేలవేసి వణుకుతూ వున్నాడు. వాడి చేతులూ కాళ్ళూ కంట్రోల్ లేకుండా వణుకుతున్నాయి. డ్రగ్ ఎడిక్షన్ అయివుండాలి. లావుపాటి ఇటాలియన్ ముసలమ్మ తన మనవణ్ణి వెంటపెట్టుకొచ్చింది. వాడు భుజం మీద నెత్తురు మరకలున్నాయి. చొక్కా చిరిగిపోయివుంది. స్ట్రీట్ గాంగ్ వార్‌లో అప్పుడే దెబ్బతిన్నాడు. ఆ కుర్రాడి ఆమండ్ కళ్ళు అప్పుడే పగతో మెరుస్తున్నాయి. మరో పదేళ్ళలో వాడు బ్రతికి బాగుంటే పెద్ద గాంగ్ లీడర్... మాఫియా బాస్ అయి ప్రజల్ని పీక్కుతిని, పోలీసులకి నిద్రాహారాలు లేకుండా చేసి నిరర్థకమైన చావు చస్తాడు- విరోధుల చేతిలోనో, పోలీసుల 'బుల్లెట్‌తోనో... సింగ్ సింగ్...శాన్ క్వెంటెన్ జెయిల్లోనో...మిగిలిన వాళ్ళూ అంతే. నీడ్రీట్‌మెంట్‌కి వచ్చిన మెక్సికన్ ప్రాస్టిట్యూట్స్... కాని వీళ్ళందరికి మెయిన్ ప్రాబ్లమ్ మాల్‌న్యూట్రిషన్ సరైన తిండిలేక, పైగా డ్రగ్స్... ఆల్కహాల్ పిశాచాల్లా వున్నారు. కాని శ్రీధర్ గాని, కాథరిన్‌గాని మాట్లాడుతున్నపుడు, వాళ్ళ భుజం తట్టి ఎంకరేజ్ చేసినప్పుడూ, మాత్రలు వాటర్లో వేసి వీళ్ళు తాగించినప్పుడూ వాళ్ళలో చిగురించిన ఆశాకిరణాల వల్ల వారిలో మానవమైన జీవపదార్థం ప్రవహిస్తున్నట్లు కనిపించారు. కాని అది ఓ కొద్ది క్షణాలు మాత్రమే పేరడ్‌లా జరిగింది.

మనసులో బలవంతంగా మూసిన ఓ తెరని మెల్లగా తీశాడు రాంచంద్.

నిళ్ళవాడు...వేరే లోకంలో...మారుతున్న ఓ సన్నటి కుర్రాడి కంఠం అన్నది.

"డాడీ నేను మెడిసన్ చదువుతాను. నేను డాక్టర్ నవుతాను."

విభ్రాంతిపోయాడు రాంచంద్!

షాక్ తిన్నాడు.

ఇన్సల్ట్ ఫీలయ్యాడు.

"వాట్??"

"అవును డాడీ నేను డాక్టర్నవుతాను"

"నో శ్రీధర్ నీవు పనిచేయాల్సిన అవసరం లేదు. నీవు వేయిమంది డాక్టర్స్‌ని, వేయిమంది లాయర్స్‌ని, వేయిమంది ఎకౌంటెంట్స్‌ని పోషించగలవు. సామాన్యుడిలా నీవెందుకు పనిచేయాలనుకుంటున్నావు? యూ ఆర్ మై సన్! నీవు ఓ వాణిజ్య సామ్రాజ్యానికి వారసుడివి కాబోతున్నావు—ఓ గ్లోబల్ ఎంపైర్! ఈ విషయం నీకు తెలుసుననుకున్నా ఇన్నాళ్ళూ".

"అది నాకు తెలుసు డాడీ. కాని, నాకు అలాంటి జీవితం మీద అభిరుచి లేదు. అయామ్ నాట్ కటౌట్ ఫర్ దట్ కైండ్ ఆఫ్ లైఫ్ డాడ్! నాకు బిజినెస్‌కి పనికొచ్చే తలకాయ లేదు. నాకు డబ్బంటే అంత ప్రలోభం లేదు. అంత డబ్బుతో ఏం చేయాలో కూడా నాకు తెలియదు."

"ఇంత తెలివితక్కువ వాడివా శ్రీధర్ నీవు? నీ వయసెంత? పదిహేడేళ్ళ వయసులో ఎవరికి మాత్రం ఏం తెలుస్తుంది? నీకేం కావాలో నీకు తెలిసే వయసేనా అది?"

"నాకేం కావాలో నాకెప్పుడూ తెలుసు డాడీ. ఇప్పుడు మీకు చెపుతున్నాను. నామాట నమ్మండి. ఐ వాంట్ టు బి ఎ డాక్టర్."

రాంచంద్ సహనం దెబ్బతింది. సామాన్యంగా టెంపర్ పోగొట్టుకునే మనస్తత్వం కాకపోయినా ఆ క్షణంలో తన స్వభావానికి వ్యతిరేకంగా ప్రవర్తించాడు. కాని శ్రీధర్ ప్రవర్తనలో ఏమాత్రం మార్పులేదు. తన పట్టు విడవలేదు.

"నీవు నామాట వినకుండా నాసలహాతో ప్రమేయం లేకపోతే డాక్టర్‌వి నీ స్వయంశక్తితో అయితే నాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు కసిగా.

శ్రీధర్ చిరునవ్వుతో అన్నాడు.

ఓకే డాడీ, నాకు మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. స్కాలర్‌షిప్‌తో సహా."

మరోసారి విభ్రాంతిపోయాడు రాంచంద్.

ఇంత జరిగిందన్నమాట తనకేమీ తెలియకుండా... తన ఇష్టాయిష్టాల సంబంధం లేకుండా...కుర్రవాడి ముఖంలో ఏమాత్రం సంకోచంలేదు. భయం అంతకన్నా లేదు. దృఢ నిశ్చయంతో నిండుకుండలా...బండరాయిలా...ఏమాత్రం చలనం లేకుండా వున్నాడు. ఏమైనా నాకొడుకు అనుకున్నాడు రాంచంద్ గర్వంగా. నిన్నా మొన్నటి స్వీట్ బేబీ ఆక్వర్డ్ టీనేజర్ కాకుండా హఠాత్తుగా పెద్దవాడైపోయాడు. వ్యక్తిత్వం వున్న మనిషిలా రూపొందాడు. మై గాడ్! కొన్నేళ్ళ క్రితం అతడి భార్య చావు బ్రతుకులలో వున్నప్పుడు ఇలా అంది.

"మీరు...మీ బిజినెస్...మీ గొడవలకు నేనెప్పుడూ అడ్డురాలేదు. ఎన్నడూ కంప్లయింట్ చేయలేదు. మన బాబుతో మీరు ఎక్కువ కాలం గడపాలి. నాకేదో భయంగా వుంది వాడి వాలకం చూస్తే! మీలాగే తన పట్టు తనదే. ఆ దేవుడు చెప్పినా వినే మనస్తత్వంకాదు. నాకు మాట ఇస్తారు కదూ?"

"అలాగే జానకీ" అన్నాడు తాను.

తృప్తిగా కళ్ళు మూసింది...

శ్రీధర్ అన్నాడు "ప్లీజ్ డాడీ! మీమాటని కాదంటున్నానని అనుకోవద్దు. నాకా వుద్దేశం లేదు. నాకు వూహ తెలిసినప్పటి నుండీ డాక్టర్ని అవాలనే నా కోరిక. వేరే ఏ ఉద్దేశం లేదు. నేను రేపు కాలేజీలో జాయిన్ అవబోతున్నాను."

అన్ని ఏర్పాట్లూ జరిగాయన్న మాట! సొంత కొడుకు తననిలా పరిహాసిస్తున్నాడు. తన మాట ఖాతరు చేయకుండా ఇంటినుండి వెళ్ళిపోతున్నాడు. తన సలహాకి గడ్డిపోచ విలువనివ్వటం లేదు.

"అన్నీ ప్లాన్స్ వేసివుంటే నేను చెప్పేదేమీ లేదు శ్రీధర్. డాక్టర్‌వి అవ్వు...ఇంకేమైనా అయినా నాకు అభ్యంతరం లేదు. ముందే చెప్పాను. పనిచేయవలసిన గతి నీకు లేదు. వజ్రాలు పొదిగిన బంగారు స్పూన్‌తో నువ్వు పుట్టావు. నీవు పుట్టింది సామాన్యుల్లా చేతులతో పనిచేసి బ్రతకడానికి కాదు. నేను సృష్టించిన ఫైనాన్షియల్ ఎంపైర్‌ని పరిపాలించడానికి నిన్ను ట్రెయిన్ చేద్దామనుకున్నాను. వేలాది మంది వర్కర్స్ వాళ్ళ జీవనభృతికి నీ వంకకు చూస్తారని, వాళ్ళని దృష్టిలో వుంచుకుని నీవు ఆ ఎంపైర్‌ని రన్ చేస్తావని నేను ఆశించాను. వాళ్ళ జీవితాలు నీ అరచేతిలో వున్నాయి శ్రీధర్. ఈ రాజ్యాన్ని నీ కోసం...కేవలం నీ ఒక్కడి కోసం నేను జీవితాన్ని ధారపోసి తయారుచేశాను. నీవు నాకు వారసుడిగా రావాలని, ఇంటర్నేషనల్ బిజినెస్ సర్కిల్స్‌లో పేరు తెచ్చుకోవాలనే నా ఆశయం. అందరూ ఏమంటారు? మై గాడ్!! వాళ్ళు విరగబడి నవ్వుతారు. నేనొక ఇంటర్నేషనల్ జోక్ అవుతానా! మిలియనియర్స్



క్లబ్ మెంబర్స్ నన్ను అంటరానివాడిలా చూస్తారు!! నీకు తెలుసా ఇది?"

"ప్లీజ్ డాడీ! దయవుంచి నన్ను అర్థంచేసుకో. మీ బిజినెస్ ప్రపంచంలో నేను చాలా...మిజరబుల్‌గా ఫీలవుతాను. మీ మిలియనీయర్ ఫ్రెండ్స్ నాకు బోర్ కొడతారు. వాళ్ళూ, వాళ్ళ డబ్బూ, వాళ్ళ మిలియన్స్, వాళ్ళ బిలియన్స్, వాళ్ళ పెళ్ళాలు, వాళ్ళ ముండలూ, వాళ్ళ జబ్బులూ, వాళ్ళ దగ్గరున్న ఆర్ట్ కలెక్షన్స్, వాళ్ళ యాట్స్...నన్ను బోర్ చేస్తాయి డాడీ! వాళ్ళూ వాళ్ళ ధనం చూస్తే నాకు భయం వేస్తుంది కొన్నేళ్ళ తర్వాత నేనూ వాళ్ళలాగా మారిపోతానేమోనని. ఆ ఊహ నన్ను భయంతో వణికిస్తుంది డాడీ! వాళ్ళ ప్రపంచానికి చెందను నేను—టూ మచ్ లీజర్, టూ మచ్ మనీ, టూ మచ్ టెన్షన్, టూమచ్ వర్రీ—బాంక్రప్ట్ అవుతామేమోనని. బోర్డ్ రూమ్‌లో జరిగే నాటకానికి నేను పనికిరాను డాడీ. రక్తం కారకుండా పీకలు కోయడానికి, నాగరీకంగా, న్యాయపరంగా వెన్నుపోటు పొడవటం నాకు చేతకాదు. హిపోక్రసీ, రెండు నాలుకల తత్వం నేను నేర్చుకోలేను. నేనేం కావాలనుకుంటున్నానో దానికి మీ అనుమతి కావాలి. ఈ కారణాల వల్ల...ప్లీజ్ డాడీ నాకు అనుమతి ఇవ్వండి."

"అయితే బిజినెస్ ప్రపంచం మీద వున్న నీ అభిప్రాయాలు ఇవన్నమాట?" అన్నాడు రాంచంద్

## స్వస్తి

ఇది వరలో సంగీతంలో సాహిత్యంలో
దేవదాసీలు గొప్పవాళ్ళు
ఇప్పుడు నాగరికత పేరు చెప్పుకుని
ఫెమినిజం పేరు చెప్పుకుని
కవులూ గాయకులూ విమర్శకులూ
అవుతున్నారు కళావంతులు
దేవుడా దిక్కెవ్వరు నాకూ నా సంస్కృతికీ?

—నిడదవోలు మాలతి

నమ్మలేనట్లుగా. తాను విన్నది నిజం కాదేమోనను కున్నాడు ముందుగా.

"అయితే డాక్టర్ శ్రీధర్ నీవు వెళ్ళవచ్చు. మళ్ళీ నాకంటికి కనిపించకు" అన్నాడు కఠినంగా.

"కాని, నాకు మిమ్మల్ని చూడాలని వుంది డాడీ. ఐ లవ్ యూ! ఈ ప్రపంచంలో డబ్బు సంపాదించడం కన్నా ముఖ్యమైన విషయాలున్నాయని మీరెందుకు అర్థం చేసుకోరు?"

"అన్ని విషయాలతో డబ్బుకి అవినాభావసంబంధం వుంది శ్రీధర్. డబ్బు లేకపోతే ఈ లోకంలో ఏముంది?"

"కళ వుంది, సంస్కృతివుంది, వేరేవిలువలు న్నాయి. డబ్బు ఒకటే ఈ లోకం కాదు డాడీ"

"కళలకీ, సంస్కృతీ సాహిత్యాలకీ పేట్రనేజ్ కావాలి. పెయింటింగ్స్ కొనే తాహతున్న వాళ్ళు కావాలి. పుస్తకాలూ, చిత్రాలూ ఎవరూ కొనకపోతే అవి ఎలా వృద్ధి చెందుతాయి? అన్ని వృత్తులూ, ఏదోవిధంగా వ్యాపారాలకి లంకె వేయబడివున్నాయి. కొన్ని లంకెలు కనబడేవి...కొన్ని ఇన్విజిబుల్!! కనిపించవు. అందువల్లనే నీవు ఏదివద్దని నిర్లక్ష్యంగా తన్నేస్తున్నావో దాని ప్రాముఖ్యత నీకు ఇప్పుడు తెలియడంలేదు. వేయి జన్మలెత్తినా నీకు ఈ అవకాశం రాదు శ్రీధర్!"

"నాకు మరో అవకాశం వద్దు డాడీ! నాకు మీ డబ్బు వద్దు. మీ ధనంతో నేను ఎన్నో బాధలు పడతాను. జీవితంలో ఏ ఛాలెంజ్ వుండదు...నాకు అలాంటి జీవితం వద్దు." ఇక్కడ చిన్న పోజ్ ఇచ్చి అన్నాడు. "మీరు నన్ను ఇంట్లోంచి తన్ని తగలేసినా సరే నాకేమీ బాధ లేదు. ఎలాగోలా నేను స్వయంశక్తితో చదువుకో గలను. మీ డబ్బులో నాకు చిల్లిగవ్వకూడా వద్దు. మీరెలా పైకి వచ్చారో నాకు తెలుసు. ఎవరి సాయమూ లేకుండానే మీరు ఇంత పెద్ద బిజినెస్ ఎంపైర్‌ని సృష్టించగలిగారు. నేను డాక్టర్‌ని నా స్వయంశక్తితోనే అవడానికి ప్రయత్నం చేస్తాను."

ఆ మాటలు అని నడిచి వెళ్ళిపోయాడు.

—మిగతా వచ్చేవారం


వెలువడుతోంది!
ఆంధ్రప్రదేశ్ దర్శిని
1600 పేజీలు. ఫుల్ కాలికో 1/4 డెమ్మీ సైజు
వెల: రూ. 200/-
నైసర్గిక స్వరూపం, చారిత్రక, ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిణామాలు, విద్య, కళలు-సాహిత్యం, సంస్కృతి జిల్లాల సమాచారం మొదలగు 40 అధ్యాయాలతో 60 మంది మేధావుల కృషితో తెలుగు వెలుగుల జిలుగులు చిందించే సమగ్ర సమాచార దర్శిని. ఇది ప్రతి గ్రంథాలయం, కళాశాల, పాఠశాల, ప్రతి ఇంటా ఉండదగిన చిన్న తరహా విజ్ఞాన సర్వస్వము.
ప్రచురణకు ముందు వెల: 150 రూ.లు
పోస్టేజి అదనం *
150 రూపాయలు నగదుగా గానీ/M.O. ద్వారా గానీ, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా గానీ ఈ క్రింది అడ్రసుకు పంపండి!
నేడే మీ కాపీ రిజర్వు చేసుకోండి!
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్ ✦ హైదరాబాద్-500 001
మరియు
విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు ●





"ఉదయం" డైలీ సీరియల్‌గా పాఠకలోకాన్ని అలరించి
డా|| దాసరి నేతృత్వంలో
ఆటంబాంబు టైటిల్‌తో
(దర్శకత్వం: బి. సత్యనారాయణ) చలన చిత్రంగా రూపొందుతున్న
సంచలన నవల........
చల్లా సుబ్రహ్మణ్యం రచన....
క్యాబరే డాన్సర్
విడుదలయింది! వెల: రూ. 30/-





దేశవ్యాప్తంగా క్యాబరే డాన్సర్ల ఫొటోలన్నీ నవల్లో వుంటాయి!
మీ దగ్గరి బుక్ షాపుల్లో అడగండి_లేదా నేరుగా మాకు వ్రాయండి!
నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్, విజయవాడ-520002